

చిట్టి చేతులతో మట్టి ప్రతిమలు

విశాఖ: శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు వినాయకుడి మట్టి ప్రతిమలను స్వయంగా తయారు చేశారు.



క్రీడాజ్యోతికి సత్కారం

విశాఖ: ఇటీవల ఒలింపిక్స్‌లో భారత్ తరపున పాల్గొన్న అథ్లెట్ యర్రా జ్యోతిని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సన్మానించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. సెప్టెంబర్ 4న 12 మి.మీ, 5న 7, 6న 22, 7న 25, 8న 19 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

నేడు ఎన్టీఆర్ వైద్యాలయంలో ప్రత్యేక సదరం క్యాంపు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 80 శాతానికి మించి వైకల్యం ఉన్నవారు, రెండు కాళ్లు చచ్చుబడి పాకుతున్నవారు, పక్షవాతంతో వీల్ చైర్‌కు పరిమితమైన వారు.. ఇలా తొమ్మిది రకాల అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు మాత్రమే మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దివ్యాంగుల పింఛన్‌కు అర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా సదరం క్యాంపు నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. మరిన్ని వివరాలకు 9908963426 నంబరను సంప్రదించాలని ఆయన కోరారు.

ఉమ్మడి విశాఖ ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షునిగా డాక్టర్ కొణతాల రాజేష్



అనకాపల్లి: ఉమ్మడి విశాఖ జిల్లా ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ కొణతాల రాజేష్‌ను నియమిస్తూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లుక్కా నరేష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మిగిలిన కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం తాను భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ, బొబ్బిలి కళాశాలలో ప్రిన్సిపాల్ అండ్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రేపు వయోవృద్ధుల జిల్లా సమావేశం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి హాల్లో ఈనెల 5న ఉదయం 10 గంటలకు జిల్లా గ్రామీణ వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు కాండ్రేగుల అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం అనంతరం 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపు కార్డులు అందజేస్తామన్నారు.

మహిళా కళాశాలలో జాబ్‌మేళా



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీల ప్రతినిధులు

విశాఖ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్‌డ్రైవ్‌లో డబ్ల్యూఎన్ఎస్, యోకోమా, టెక్ట్‌విజన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాలో 515 మంది అభ్యర్థులు హాజరు కాగా 56 మంది ఎంపికయ్యారని, 76 మంది షార్ట్‌లిస్ట్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ సాయికృష్ణ చైతన్య, ప్లేస్‌మెంట్ అధికారి రమేష్‌నాయుడు, కళాశాల అధ్యాపకులు ఆర్.కిరణ్మయి, అరుణపద్మ, హైమావతి, డి.ప్రజ్ఞతోపాటు ఆయా కంపెనీల ప్రతినిధులు రవి, ప్రదీప్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ భూములను పరిరక్షించాలి



భీమిలిలో భూములను పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ భూములకు ఫెన్సింగ్ వేసి పరిరక్షించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా భీమిలిలోని కొత్తవలస, నిడిగట్టు, కాపులుప్పాడ, పరదేశిపాలెం తదితర గ్రామాల్లో సంస్థకు చెందిన భూములను అధికారులతో కలిసి పరిశీలించారు. కొన్ని స్థలాల విషయంలో న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పటికీ.. వాటిని అధిగమించే విషయంపై దృష్టి సారించాలని చెప్పారు. కాపులుప్పాడ గ్రామంలో ఉన్న చెరువు పునర్జీవానికి గల అవకాశాలను స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బందితో చర్చించారు. ఈ క్షేత్ర స్థాయి పర్యటనలో ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ మధు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చినబాబు చేతిలో రిమోట్ కంట్రోల్

- పోలీస్ పోస్టింగుల్లో స్థానిక నేతలకు మొండిచేయి
- అసంతృప్తితో రగిలిపోతున్న కూటమి ఎమ్మెల్యేలు
- సాక్షాత్తూ హోంమంత్రికే సొంత జిల్లాలో విలువ లేదు
- లోకేష్ ఆదేశంతో ఒక సామాజికవర్గం వారికే అందలం

తమకు అనుకూలమైన పోలీసు అధికారులుండాలని సహజంగా ప్రజాప్రతినిధులు కోరుకుంటారు. అందుకు అనుగుణంగా పోస్టింగులూ వేయించుకుంటారు. కానీ జిల్లాలో పోలీసు నియామకాలు పరిశీలిస్తే.. స్థానిక నేతలెవరికీ సానుకూలంగా లేవు. అలాగనీ పద్ధతి ప్రకారం జరిగాయా అంటే.. అదీ లేదు. ఒకే సామాజిక వర్గం వారికి ప్రాధాన్యం ఇచ్చారని, పై నుంచి చినబాబే చక్రం తిప్పారని పోలీసు వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.



సాక్షి, అనకాపల్లి: హోం మంత్రి మనవారు.. స్పీకర్ మనవారు.. ఇక మనకు తిరుగేలేదని ఆశించిన అస్మదీయులకు ఎదురుదెబ్బ తగిలింది. తమ వారిని సంతృప్తి పరిచే విధంగా పోస్టింగులు వేయించలేనందుకు నేతల అహమూ దెబ్బతింది. కానీ అందరూ మిన్నకున్నారు. నోరే మెదపలేదు. కారణం.. లోకేష్ బాబు అంతా తానై పై నుంచి రిమోట్ కంట్రోల్‌తో పావులు కదపడమే. ఎమ్మెల్యేల్లో మాత్రం లోలోన అసంతృప్తి రగులుతోంది. పెందుర్తిలో పంచకర్ల రమేష్‌బాబు ఇప్పటికే గన్‌మేన్‌ను వెనక్కు పంపి తన అసంతృప్తిని వెళ్లగక్కారు. ఇక భీమిలిలో గంటా కూడా పోస్టింగుల తంటాతో సతమతమవుతున్నారు. పాయకరావుపేటలో హోంమంత్రి అనితతో ఉన్న విభేదాల వల్లే తన మాట చెల్లుబాటు కావడం లేదా లేక పై నుంచి వచ్చిన ఆదేశాలే కారణమా అని ఆయన తర్జనభర్జన పడుతున్నారు. హోంమంత్రికి అంత సీనే ఉంటే జిల్లాపై తన పట్టు నిరూపించుకునే వారని, ఆమెను నియోజకవర్గానికే పరిమితం చేసి, చినబాబు ఒక సామాజిక వర్గానికే కీలక పోస్టులు కట్టబెట్టారన్న వాదన వినిపిస్తోంది.

ఆశ.. నిరాశ

జిల్లా ఎమ్మెల్యేలు, మంత్రుల సామాజిక వర్గాల వారినే పోలీసు ఉన్నతాధికారులుగా నియమించడం పరిపాటి. అలాగే ఈసారి కూడా ఎస్సీ, వెలమ, తూర్పుకాపు, గవర, యాదవ కులాలకు చెందిన వారిని తెచ్చుకుందామని కూటమి ప్రజాప్రతినిధులు ఆశించారు. కానీ అలా జరగలేదు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఇద్దరూ తమ సామాజిక వర్గానికి చెందిన వారే పోలీస్ ఉన్నతాధికారిగా ఉండాలని ప్రయత్నాలు చేసినా వారికి నిరాశే మిగిలిందని సమాచారం. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తమ సామాజిక వర్గానికి చెందిన డీఎస్పీని తెచ్చుకోవాలని ప్రయత్నం చేసినా ఫలించలేదు. దీంతో టీడీపీ సీనియర్ నేతలు, జనసేన ఎమ్మెల్యేలు సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత సొంత జిల్లా అయినప్పటికీ ఆమెను నియోజకవర్గానికే పరిమితం చేశారు. కనీసం డీఎస్పీని సైతం తనకు కావలసిన వారిని ఆమె వేయించుకోలేకపోయారు. పోలీస్ విభాగంలో పై నుంచి కింది వరకు సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ కనుసన్నల్లోనే బదిలీ ప్రక్రియ, పోస్టింగ్‌లు జరిగాయి. ఫలితంగా స్థానిక సీనియర్ ప్రజాప్రతినిధులకు పరోక్షంగా చెక్ పడింది. అది వారిలో అసంతృప్తి సెగలు రేకెత్తిస్తోంది. అనకాపల్లి నియోజకవర్గంలో కశింకోట మినహా ఇంకెక్కడా కొణతాల మాట చెల్లుబాటు కాలేదు.

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పరవాడ సీఐగా తన సామాజిక వర్గానికి చెందిన వారిని తీసుకొద్దామని తీవ్ర ప్రయత్నం చేసినా.. కీలకమైన లోకేష్ తనకు అనుకూలమైన సామాజిక వర్గీయుడికే పోస్టింగ్ కల్పించారు.

మల్లికార్జునుడికి డబుల్ ధమాకా

జిల్లాలో ప్రజాప్రతినిధుల పరపతి అలా ఉంటే.. విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న సీఐ మల్లికార్జునరావు హవా మాత్రం వేరే లెవెల్లో ఉంది. ఉన్నతాధికారులు ఒకేసారి ఒకరికి తెలియకుండా మరొకరు రెండు చోట్ల ఆయనను సీఐగా నియమించి స్వామి భక్తి చాటుకున్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ సీఐగా, రేంజ్ పరిధిలో పరవాడ సీఐగా ఒకేసారి రెండుచోట్ల నియమితులు కావడం ఆశ్చర్యానికి గురి చేసింది. చివరికి సోమవారం తనకు ఇష్టమైన పరవాడ సీఐగానే మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కొత్తగా నియమితులైన అనకాపల్లి డీఎస్పీ శ్రావణి వ్యక్తిగత పనులపై 6 నెలలపాటు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. అనకాపల్లి డీఎస్పీగా నియమించిన నాటికే సెలవులో ఉన్న ఆమె.. విధుల్లో చేరి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించి మళ్లీ సెలవుపై వెళ్లారు. ఇక్కడ ఆరు నెలలపాటు ఇన్‌చార్జిగా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కొనసాగనున్నట్లు సమాచారం.

డీసీసీబీ డిజిటలైజేషన్..!

- సొసైటీల రికార్డుల కంప్యూటరీకరణ
- డీసీసీబీ చరిత్రలో ఇదే తొలిసారి
- నాబార్డ్ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్
- సభ్యుల సమస్త వివరాల సేకరణ



విశాఖలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య: వ్యవసాయ పరపతి సంఘాలను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) ఆదేశాలతో డీసీసీబీ అధికార యంత్రాంగమంతా ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమైంది. ఈ సంఘాల్లో సభ్యత్వం పొందిన రైతులు, వివిధ రకాల రుణాలు పొందిన వారి సమస్త వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి నాటి నుంచి సొసైటీల్లోని అన్ని రకాల కార్యకలాపాలు ఆన్‌లైన్ ద్వారానే జరగాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని తమ యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. డేటా సేకరణపై ప్రతి రోజు సంఘాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

బినామీలకు చెక్ పెట్టేలా..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో 98 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్) ఉన్నాయి. వీటిలో 3,88,179 మంది సభ్యులున్నారు. సొసైటీల్లో సభ్యత్వం పొందిన వారికి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నారు. చాలా చోట్ల రైతుల పేరుతో బినామీలు చొరబడి ప్రభుత్వ సబ్సిడీ రుణాలను కొల్లగొడుతున్నారని ఫిర్యాదులున్నాయి. ఇలాంటి వాటిపై నాబార్డు దృష్టి పెట్టింది. వీటికి అడ్డుకట్ట వేసేలా సహకార సంఘాల్లోనూ ఆన్‌లైన్ ద్వారానే కార్యకలాపాలు నిర్వహించాలనే నాబార్డు ఆదేశాలకు అనుగుణంగా డీసీసీబీ అధికారులు చర్యలు చేపట్టారు.

'డీసీటీ'లో సభ్యుల సమగ్ర వివరాలు

సొసైటీల వారీగా సభ్యులకు చెందిన భూములు, ఆస్తులు, వారు తీసుకున్న రుణం, కుటుంబ పరిస్థితి వంటి సమగ్ర వివరాలను నాబార్డ్ ప్రత్యేకంగా రూపొందించిన డేటా క్యాప్చర్ టూల్(డీసీటీ) అనే వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఆధార్ నంబర్‌తో ఆ వివరాలను అనుసంధానిస్తుండటంతో దేశంలో ఎక్కడైనా బ్యాంకుల్లో వీరి వివరాలు పరిశీలించే అవకాశం ఉంటుంది. రుణ గ్రహీతల వివరాలను సకాలంలో గుర్తించేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం సొసైటీల్లో సిబ్బంది అంతా ఇదే పనిలో నిమగ్నమవడంతో ఖరీఫ్ రుణాల మంజూరులో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

అందుబాటులో లేని రికార్డులతో తర్జన భర్జన

సొసైటీలో సభ్యుల డేటా సేకరణ సవ్యంగా ముందుకు సాగడం లేదు. విశాఖ జిల్లాలోని 13 సొసైటీల్లో 60,668 మంది సభ్యులుండగా.. వీరిలో ఇప్పటివరకు 11,843 మంది సభ్యుల వివరాలు సేకరించారు. 8,889 మంది వివరాలను డీసీటీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. అల్లూరి జిల్లాలోని 11 సొసైటీల్లో 27,831 మంది సభ్యులకు గాను 7,812 మంది సభ్యుల వివరాలు సేకరించారు. 2,500 మంది వివరాలను అప్‌లోడ్ చేశారు. అనకాపల్లి జిల్లాలోని 74 సొసైటీల్లో 2,99,660 మంది సభ్యులుండగా.. వీరిలో ఇప్పటివరకు 1,08,255 మంది వివరాలను సేకరించి.. 86,775 మంది డేటాను అప్‌లోడ్ చేశారు. సభ్యుల వివరాల కంప్యూటరీకరణ డీసీసీబీ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో చాలా మంది వివరాలు సొసైటీల్లో అందుబాటులో లేని పరిస్థితి ఉంది.

భవిష్యత్తు అవసరాలకు ఎంతో మేలు



సహకార సంఘాల కంప్యూటరీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. దీని వల్ల పారదర్శకతతోపాటు భవిష్యత్తులో రుణాలు సకాలంలో పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, ఉన్నతాధికారుల సూచనలతో గడువులోగా సభ్యుల సమస్త సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా ప్రతి రోజూ సొసైటీల వారీగా సమీక్షిస్తున్నాం. ఆన్‌లైన్ పనులతో ఖరీఫ్ రుణాల మంజూరుకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

– డి.వి.ఎస్.వర్మ, డీసీసీబీ సీఈవో

వచ్చేనెల నుంచి భూముల విలువ పెంపు

- ఆర్ అండ్ బి రోడ్లకు ఇరువైపుల ఎకరం రూ.15–18 లక్షలు
- గ్రామాల్లో భూములకు ఎకరానికి రూ.10 లక్షలకు పెంపు
- పెంచిన రేట్లతో రిజిస్ట్రేషన్ల వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయం
- కోటవురట్ల సబ్ రిజిస్ట్రారు నర్సింహమూర్తి వెల్లడి

నాతవరం: వచ్చే నెల నుంచి రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ పెంచుతున్నట్టు కోటవురట్ల సబ్ రిజిస్ట్రారు పి.నర్సింహమూర్తి తెలిపారు. మంగళవారం మండలంలో నర్సీపట్నం–తుని మధ్య, తాండవ జంక్షన్–నాతవరం మధ్య ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న భూములను ఆయన పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసనాయుడుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం భూమల విలువ పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. నాతవరం, యల్లవరందొండపేట, ఎం.బెన్నవరం. శృంగవరం రెవెన్యూ గ్రామాల్లో ఆర్అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరానికి రూ.15 నుంచి రూ.18 లక్షల వరకు పెరుగుతుందన్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో భూమి ఎకరం ఒక్కంటికి రూ.10 లక్షలు ఉందన్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా 31 పంచాయతీలలో ఆయా ప్రాంతాలను బట్టి ఎకరం ఒక్కంటికి రూ.10 లక్షల వరకు విలువ పెరుగుతుందన్నారు.

ప్రస్తుతం అతి తక్కువగా డొంకాడ అగ్రహారం రెవెన్యూ గ్రామ పరిధిలో ఎకరం భూమికి రూ.5.50 లక్షలు మాత్రమే ఉందని, దానిని రూ.10 లక్షల వరకు పెంచుతామన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా సర్వే నంబర్లు సేకరించి ఆయా భూములకు రిజిస్ట్రేషన్ విలువ నిర్ణయిస్తామన్నారు. భూముల విలువ పెంచే విషయంపై జాయింట్ కలెక్టర్ రిజిస్ట్రేషన్ల కార్యాలయాలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారన్నారు. జేసీ, వీఎంఆర్‌డీఏ అధికారుల ఆదేశాలు అనుసరించి పెంచిన భూముల రేట్లు వచ్చే అక్టోబర్ నుంచి అమల్లోకి వస్తాయన్నారు. భూముల క్రయ, విక్రయాల వల్ల రిజిస్ట్రేషన్లు భారీగా జరిగి ప్రభుత్వానికి మరింత ఆదాయం వస్తుందన్నారు. 2023, మార్చి నెలాఖరువు వరకు తమ పరిధిలోని మండలాల్లో పంచాయతీలకు రిజిస్ట్రేషన్ల ద్వారా ఇవ్వాల్సిన నిధులు అందజేసామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భూముల విలువ పెంపకంపై తహసీల్దార్ శ్రీనివాసనాయుడితో చర్చిస్తున్న సబ్ రిజిస్ట్రారు నర్సింహమూర్తి

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి



వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



వరి పైరుకు పరిహారం అందించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- ఎకరాకు రూ.20 వేలు సాయం ప్రకటించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వరి పంటకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లి ఆవలో ముంపునకు గురైన వరి పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతుల నుంచి పెట్టిన పెట్టుబడుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మునిగిన వరి పంటను గుర్తించడంతో పాటు దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు చేయాలన్నారు. ఎకరాకు రైతుకు రూ.20 వేలు నష్ట పరిహారం అందించాలని కోరారు. కొత్తగా విత్తనాలు వేసేందుకు సాయం చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, పార్టీ నాయకులు మళ్ల సంజీవరావు, దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల జగన్, ఆడారి కాశీబాబు, కోనపలి రామ్మోహనరావు, సరిసా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డున పడ్డ చేపలు



తుపాను కారణంగా వేట లేక ఒడ్డున లంగరు వేసిన తెప్పలు

- వేట సాగక.. పూటగడవక పస్తులతో గంగపుత్రులు
- తరుచూ ప్రకృతి వైపరీత్యాలతో మత్స్యవేటకు దూరం
- అందని ప్రభుత్వ 'భరోసా'

వేట లేక, పూట గడవక మత్స్యకారులు పస్తులుంటున్నారు. తుపానులు, వేటనిషేధం తదితర కారణాలతో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు మూడు మాసాల పాటు గంగపుత్రులంతా మత్స్యవేటకు దూరమయ్యారు. ఓవైపు వృత్తికి దూరమై, భుక్తి కరువై అవస్థలు పడుతున్నారు. మరోవైపు వేట నిషేధ సమయానికి ప్రభుత్వం ఇవ్వాల్సిన పరిహారం మత్స్యకార భరోసాను కూడా ఇప్పటివరకూ ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.




వేట లేక తీరంలో వలలు , బోట్లు రిపేరు చేసుకుంటున్న మత్స్యకారులు

నక్కపల్లి : సముద్రంలో వేట నిషేధ సమయం ఏప్రిల్ 14 నుంచి జూన్ 14 వరకు రెండు నెలల పాటు మత్స్యకారులు వృత్తికి దూరమై ఇంటికే పరిమితమయ్యారు. తరువాత జూలై ఆగస్టులో రెండుసార్లు తుపానులు, సముద్రంలో వాయుగుండం కారణంగా 15 రోజుల పాటు వేటకు వెళ్లలేకపోయారు. తాజాగా నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా కూడా మత్స్యకారులు సముద్రానికి దూరంగానే ఉన్నారు. తాజాగా వాతావరణ శాఖ హెచ్చరికలతో మరో వారం రోజుల పాటు ఇదే పరిస్థితి నెలకొనే పరిస్థితి ఉంది. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఏడాది మత్స్యకార భరోసాకు మంగళం పాడింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వేటనిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20వేలు నష్టపరిహారం ఇస్తామని ఎన్నికల సమయంలో మత్స్యకారులకు హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చాక అసలు భరోసా ఊసే మరిచిపోయింది.

అనకాపల్లి జిల్లాలో తీరప్రాంతం వెంబడి 6 మండలాల్లో (పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం, రాంబిల్లి, అచ్చుతాపురం,పరవాడ) సుమారు 11,010మంది మత్స్యకారులు సుమారు 3వేలకుపైగా లైసెన్స్ కలిగిన తెప్పలు, బోట్లు, ఇంజన్లపై వేట సాగిస్తుంటారు. ఒక్కో ఇంజిను కలిగిన బోటు, తెప్పలపై ఆరుగురు వేటకు వెళ్తుంటారు. అలాగే చేపల వేటనే కాకుండా పరోక్షంగా కూడా మరో 10 వేల మంది చేపలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేసి టోకు పద్ధతిలో గ్రామాల్లో విక్రయిస్తూ కుటుంబాలను పోషిస్తుంటారు. ఈ సమయంలో చేపల వేట తప్ప మరో ఉపాధి లేని మత్స్యకారులు ఇంటి వద్దే ఉండిపోతారు. వేట విరామ సమయంలో మత్స్యకారులకు గతంలో రూ. 4వేలు చెల్లించేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మత్స్యకారులకు రూ.10వేల చొప్పున నష్టపరిహారాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇలా ఐదేళ్లపాటు ఈ ప్రక్రియ నిరాటంకంగా కొనసాగింది. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఇవ్వాల్సిన వేట నిషేధ పరిహారాన్ని ఇప్పటి వరకూ ఇవ్వలేదు. మత్స్యకార భరోసాయే ఇవ్వని ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రత్యేకంగా ఏవిధమైన పరిహారం ఇస్తుందన్న ఆశలేదని గంగపుత్రులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో వేటనిషేధం ముగిసిన నెలలోపే పరిహారం అందేదని, కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడిచిపోయినా పరిహారం గురించి నోరు మెదపడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ల తెరచి ప్రతి ఏటా ఇచ్చే వేటనిషేధ నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని కోరుతున్నారు. చేపల వేట సాగకపోగా గ్రామాల్లో వ్యవసాయ పనులు కూడా ఉండడం లేదని, వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు,

పూట గడవక ఇబ్బంది



వేటనిషేధ సమయంలో రూ.20 వేలు ఇత్తామన్నారు. ఇంతవరకు ఈయనేదు. గతంలో జగనన్న పెబుత్వంలో పదేల సొప్పున పెతి ఏటా మా బేంక్ అకౌంట్లో ఏసేవోరు. రెండునెలల పాటు ఏట నేక మేమంతా పత్తులున్నాం. ఇత్తానన్న డబ్బులు ఈయాలి కదా.. మోసం సేయడం ఎందుకు? ఇరవై ఏలు ఇత్తారోపోతారో మాకనవసరం పెతిఏటా ఇచ్చే పదేలన్నా బేంకుల్లో ఏయండి. వారం రోజుల నుంచి ఏటకు ఎల్లక పూటగడవడం నేదు.

–వై.అప్పలరాజు, మత్స్యకారుడు, రాజయ్యపేట

వెంటనే పరిహారం చెల్లించాలి



సముద్రంలో మత్స్యవేట నిషేధ సమయంలో ఇస్తామన్న భరోసా డబ్బులు ఇంతవరకు ఇవ్వకపోవడంతో మత్స్యకారులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వేట చేసేవారితో పాటు వారిపై ఆధారపడి పలువురు మహిళలు కూడా ఉపాధి పొందుతుంటారు. చేపలు కొని గ్రామాల్లో అమ్ముతుంటారు. ఇంతవరకు వీరికి ఎటువంటి పరిహారం చెల్లించడం లేదు. వెంటనే ప్రభుత్వం వేటనిషేధ పరిహారం వర్తింపజేయాలి.

–గోసల కాసులమ్మ, జెడ్పీటీసీ మత్స్యకార నాయకురాలు

క్లుప్తంగా

శ్రీవారి భక్తులకు శుభవార్త

మూడు రోజుల పాటు లడ్డూల విక్రయాలు



శ్రీవారి ఆలయంలో లడ్డూ విక్రయాలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(టీటీడీ)లో ఇకపై వారంలో మూడు రోజులు లడ్డూలు విక్రయించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ప్రతి నెలా రెండవ శనివారం మాత్రమే శ్రీవారి లడ్డూలను విక్రయించామని.. భక్తుల కోరిక మేరకు గురు, శుక్ర, శనివారాల్లో కూడా లడ్డూలను విక్రయిస్తామని వెల్లడించారు.

పెద్దేరు నదిలో వ్యవసాయ కూలీ గల్లంతు



నాగరాజు (ఫైల్)

చోడవరం రూరల్: పట్టణ సమీపంలోని గౌరీపట్నం గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు కూలీ ఆకుల నాగరాజు(57) మంగళవారం మధ్యాహ్నం పెద్దేరు నది దాటుతూ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న వెంటనే చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు సంఘటనా స్థలికి చేరుకుని గ్రామస్తులు సహకారంతో రెస్క్యూ బృందంతో పాటు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడేంత వరకు గాలించినా నాగరాజు ఆచూకీ లభించలేదు. గల్లంతైన వ్యవసాయ కూలీకి కుమారులు కృష్ణ, సాయికృష్ణ, కుమార్తె సుందరపు వరలక్ష్మి ఉన్నారు. గౌరీపట్నం వ్యవసాయ భూములు పెద్దేరు నది ఆవలిగట్టు వైపు ఉంటాయి. మధ్యాహ్నం భోజనానంతరం వ్యవసాయ పనులు నిమిత్తం పెద్దేరు గ్రామ పంచాయతీ రేవు నుంచి రోజు మాదిరిగానే దాటుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ అదుపు తప్పి పడిపోవడంతో నదీ ప్రవాహంలో గల్లంతయ్యాడు.

అదృశ్యమైన మహిళ మృతి

- ఏలేరు కాలువలో మృతదేహం లభ్యం

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలేనికి చెందిన అల్లంకి నూకరత్నం గత నెల 27వ తేదీన అదృశ్యమై విగతజీవిగా మారింది. మండలంలో బట్లపూడి పంచాయతీ పరిధి ఏలేరు కాలువలో మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ మంగళవారం తెలిపారు. బట్లపూడి ఏలేరు వైపు వెళ్తున్న కాలువలో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వారి సమాచారం మేరకు పట్టణ, రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా, నూకరత్నందిగా గుర్తించారు. ఈ మేరకు పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, పట్టణ సీఐ కేసు నమోదు చేశారు.

వరిలో జింకులోపం

- చెరకు పంటకు వడలు తెగులు ఆశించే అవకాశం
- నివారణకు దృష్టి సారించాలన్న ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు



మాట్లాడుతున్న ఏడీఆర్ ముకుందరావు

అనకాపల్లి: వాతావరణ పరిస్థితులకు నాటిన వరిపైరులో, నారుమడిలో జింకులోపం కనిపించే అవకాశం ఉందని, నివారణకు 2 గ్రాముల జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్ ముకుందరావు సూచించారు. మంగళవారం స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి పైరు నాటిన వెంటనే, పిలకల దశలో ముంపునకు గురయినట్లయితే, వర్షాల అనంతరం నీరును బయటికి తీసివేసి పైరు కోలుకోవడానికి 20 కిలోల పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. తెగుళ్ల వ్యాప్తి చెందకుండా 2 గ్రాముల కార్బెండజిల, మాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ముంపునకు గురైన వరి పొలంలో ఆకుచుట్టు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. అధిక నీరును బయటకు తీసివేసి లీటరు నీటికి 1.6 మీ.లీల మోనోక్రోటోఫాస్ లేదా 2.5 మీ.లీల క్లోరిఫైరిఫాస్‌ను పిచికారీ చేసి నివారించవచ్చన్నారు. రైతులు ముదురు నారు నాటాల్సి వస్తే, రాగల వర్షాలను ఉపయోగించుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నారు నాటినప్పుడు కుదుళ్ల సంఖ్య పెంచి, కుదురుకు 4, 5 మొక్కల చొప్పున నాట్లు వేయాలన్నారు. ముదురు నారు వేసినప్పుడు నత్రజని ఎరువును రెండు దఫాలుగా వాడాలన్నారు. 70 శాతంగా 60 కిలోల యూరియా నాటేటప్పుడు, మిగతా 30 శాతంగా 25 కిలోల యూరియా అంకురం దశలోనూ వేసుకోవాలన్నారు. చెరకు పొలంలో నీరు నిలబడితే వడలు తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. వెంటనే పొలంలో నుంచి నీరు బయటికి తీసివేసి, తెగులు ఆశించిన మొక్కలను తీసి కాల్చివేయాలని తెలిపారు. తెగులు వ్యాపించకుండా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు పత్తిలో నల్లమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున, పొలంలో అధిక నీరును బయటకు తీసివేసి 10 లీటర్ల నీటికి 30గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, బి.భవాని, వి.చంద్ర శేఖర్, పి.వి.పద్మావతి, ఎ.అలివేణి పాల్గొన్నారు.

సినిమాలపై ఆసక్తే దర్శకుడ్ని చేసింది

- వెండితెరపై సత్తా చాటుకుంటున్న కశింకోట కుర్రోడు
- మూడు సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్ కల్కితో 'సాక్షి' చిట్‌చాట్

అనగనగా ఓ కుర్రాడు. వెండితెరపై వెలగాలని కలలుగన్నాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోతేనేం, కలలకు మాత్రం కొదవలేదు. ఇంట్లో వాళ్లు వారించారు. స్నేహితులు చెప్పి చూశారు. కానీ తను ఆగలేదు. తపన వీడలేదు. చదువు పూర్తయిన తరువాత హైదరాబాద్ బండి ఎక్కేశాడు. ఆ మహానగర కూడలిలో అయోమయంగా నిలబడ్డాడు. పొద్దున్నే సినిమా స్టూడియోల ముందు వాలిపోవడం, వచ్చేపోయే వాళ్ల ముందు తన టాలెంట్ చూపించడం దినచర్యగా మారింది. ఊహించని అవకాశం వచ్చింది. దర్శకుడు సముద్రఖని వద్ద సహాయకుడిగా చేరాడు. ఆ కాస్త పట్టు చాలు.. అంచెలంచెలుగా ఎదగడానికి..దశాబ్దం తిరిగేసరికల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో డైరెక్టర్‌గా ఎదిగాడు అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన కొల్లు కల్కి. ఇటీవల తిమ్మాపురంలో ఓ చిత్ర షూటింగ్ నిమిత్తం వచ్చిన సందర్భంగా 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

– కొమ్మాది

సాక్షి: షార్ట్ ఫిల్మ్ ద్వారా మీ ప్రస్థానం ప్రారంభమైందా?

కల్కి: చదువుకున్న సమయంలోనే సినిమాలన్నా, కథలన్నా చాలా ఆసక్తి ఉండేది. డిగ్రీ పూర్తయిన తరువాత షార్ట్ ఫిల్మ్స్ ట్రెండ్ మొదలైంది. సుమారు 20కు పైగా షార్ట్ ఫిల్మ్‌లకు దర్శకత్వం వహించా. దానిలో శ్రీనుగాడి ప్రేమ, సిన్సియర్ మామ అనే సినిమా మంచి గుర్తింపునిచ్చింది.

సాక్షి: టాలీవుడ్‌లో అవకాశం ఎలా వచ్చింది?

కల్కి: సినిమాలపై ఆసక్తితో చదువు పూర్తయిన తరువాత అనకాపల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్లా. షూటింగ్ ఎక్కడ ఉన్నా వెళ్లేవాడ్ని. ఈ క్రమంలో రవితేజ నటించిన శంభో శివశంభో సినిమా చిత్రీకరణ జరుగుతున్నప్పుడు దర్శకుడు సముద్రఖని దగ్గర సహాయకుడిగా చేరా.

సాక్షి: : అసిస్టెంట్ డైరెక్టర్‌గా, కో–డైరెక్టర్‌గా ఎన్ని సినిమాలు చేశారు?



దర్శకత్వ పర్యవేక్షణలో కొల్లు కల్కి

కల్కి: నటుడు రాజేంద్రప్రసాద్ నటించిన నూతిలో కప్పలు, జంప్, ప్రేమలో ఇద్దరు అనే సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశా. అదే విధంగా ఇటీవల విడుదలైన సాయికుమార్ నటించిన లక్ష్మీ కటాక్షం, హనీ ట్రాప్ అనే సినిమాలకు కో- డైరెక్టర్‌గా వ్యవహరించా.

సాక్షి: నాలుగు భాషల్లో సినిమానా?

కల్కి: ఔనండి. నేటి సమాజానికి ఉపయోగపడే ఒక సందేశాత్మకమైన కథతో వాట్ లాగా దేంగే అనే పేరుతో తీశాం. తెలగు, హిందీ, ఇంగ్లిష్, తమిళ భాషల్లో తీశాం. త్వరలో ఓటీటీ వేదికగా రిలీజ్ చేయబోతున్నాం.



నటీనటులకు సన్నివేశాలు వివరిస్తున్న దర్శకుడు కొల్లు కల్కి

సాక్షి: సీరియల్స్ ఏమైనా చేశారా?

కల్కి: తెనాలి రామకృష్ణుడు సీరియల్‌కు దర్శకత్వం వహించాను. అది త్వరలో ప్రముఖ టీవీ చానల్‌లో ప్రసారం కానుంది.

సాక్షి: ప్రస్తుతం చేస్తున్న సనిమాలు?

కల్కి: సెల్‌ఫోన్ మనిషి జీవితంలో భాగమైపోయింది. ఈ అంశంతో ఫోన్ పోయిందా... ప్రాణం గోవిందా అనే వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తున్నా. అదే విధంగా గ్రామ వలంటీర్ అనే సినిమాకు దర్శకత్వం వహించాను. అది త్వరలో ఓటీటీ వేదికగా రిలీజ్ కానుంది.

సాక్షి: భవిష్యత్తులో ప్రణాళిక ఏంటి?

కల్కి: ప్రస్తుతం ఓ మంచి ప్రేమ కథ సిద్ధం చేశా. ఇప్పటికే పలువురు నిర్మాతలకు కథ వినిపించా. త్వరలో పెద్ద సినిమాతో మీ ముందుకు వస్తా. అదే విధంగా అనకాపల్లి జిల్లాకు సంబంధించిన ఓ కథను సిద్ధం చేస్తున్నాను.

ఏ దిల్ మ్యాంగో మోర్

- కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడలో రెండు సీజన్లలో మామిడి దిగుబడి
- రైతులకు అదనపు ఆదాయం



కొత్త కొవ్వాడలో ఎగుమతికి సిద్ధంగా ఉన్న మామిడి కాయలు



పాలం బారా మస్ మామిడి పండ్లు



పాత కొవ్వాడలో కాసిన పాలం బారామస్ మామిడి కాయలు

పద్మనాభం: సాధారణంగా వేసవి కాలంలో మామిడి కాయలు కాస్తాయని మనందరికీ తెలుసు. అయితే కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ గ్రామాల్లో ప్రస్తుతం కూడా మామిడి కాయలు కాస్తున్నాయి. ఇక్కడ రైతులు 'చిడత పూడి', 'పాలం బారామస్' అనే రెండు రకాల మామిడి చెట్ల ద్వారా ఏడాదికి రెండు సార్లు ఆదాయం పొందుతున్నారు. వ్యవసాయ రంగంలో వినూత్న విధానాలను అనుసరిస్తూ.. ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ గ్రామాల్లో వేసవి కాలంలో మే వరకు మొదటి పంటను ఇచ్చే ఈ చెట్లు, తర్వాత వెంటనే పూతకు వచ్చి ఆగస్టు రెండవ వారం నుంచి సెప్టెంబర్ మొదటి వారం వరకు రెండవ పంటను ఇస్తాయి. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ తోటలు ప్రతి ఏడాది రైతులకు మంచి ఆదాయాన్ని అందిస్తున్నాయి. పాలం బారామస్ మామిడి ఒక ఎకరానికి సుమారు ఒక టన్ను దిగుబడినిస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో ఒక టన్ను పాలం బారామస్‌కు రూ.50,000 ధర పలుకుతోంది. చిడత పూడి కూడా ఒక ఎకరానికి సుమారు ఒక టన్ను దిగుబడినిస్తుంది. అయితే, ప్రస్తుతం ఒక టన్ను చిడత పూడి రూ.15,000 నుంచి రూ.20,000 వరకు మాత్రమే పలుకుతోంది. ఒడిశా రాష్ట్రం రాయపూర్ వంటి ప్రాంతాల నుంచి వ్యాపారులు నేరుగా కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ గ్రామాలకు వచ్చి ఈ మామిడి కాయలను కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఈ రెండు రకాల మామిడికీ మంచి డిమాండ్ ఉండేది. అయితే ఈ ఏడాది మాత్రం చిడత పూడి రకం మామిడి కాయలను వ్యాపారులు కొనడానికి ఆసక్తి చూపడం లేదని పాత కొవ్వాడకు చెందిన రైతు బి.దుర్గారావు తెలిపారు. 'చిడత పూడిని ఆవకాయ తయారీకి ఉపయోగిస్తారు. పాలం బారామస్ పండ్లుగా తినడానికి ఉపయోగ పడతాయి. అందుకే వీటికి ఎక్కువగా డిమాండ్ ఉంటుంది' అని వివరించారు. ఈ ఏడాది చిడత పూడికి డిమాండ్ తగ్గడం రైతుల్లో కొంత ఆందోళన కలిగిస్తోంది.

స్థల వివాదంలో అన్నావదినపై కత్తితో దాడి

- ఆర్.ఖై.అగ్రహారంలో ఘటన





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అన్న దేముడు, తలపై గాయంతో వదిన నారాయణమ్మ

కె.కోటపాడు: ఇంటి సరిహద్దు స్థలం విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం తలెత్తింది. దాంతో తమ్ముడు గొర్లి సన్యాసిరావు కోపోద్రిక్తుడై తన అన్నావదిన దేముడు, నారాయణమ్మలపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఆర్.వై.అగ్రహారంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎ.కోడూరు ఎస్ఐ రమేష్ వివరాల మేరకు... గ్రామంలో ఇంటి సరిహద్దు సమస్యతో అన్నదమ్ములు దేముడు, సన్యాసిరావు గొడవపడ్డారు. ఈ ఘర్షణ తీవ్రతరం కావడంతో తమ్ముడు కత్తి తీసుకువచ్చి అన్నావదినల తలపై దాడి చేశాడు. వీరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు కె.కోటపాడు సీహెచ్‌సీకి చేర్పించారు. దేముడు తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. బాధితురాలు నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ తెలిపారు.

25 కేజీల గంజాయితో కారు స్వాధీనం

- ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన ఇద్దరు నిందితులకు రిమాండ్



కారులో పట్టుబడిన గంజాయితో సీఐ విజయకుమార్, ఎస్ఐ సత్యనారాయణ

అనకాపల్లి: మండలంలోని తుమ్మపాల సమీపంలో మూన్‌లైట్ దాబా వద్ద వాహనాల తనిఖీల్లో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని 25 కేజీల గంజాయితోపాటు కారును స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ మంగళవారం తెలిపారు. ఢిల్లీలో సబ్జిమసీద్, దరియాగంజ్‌కు చెందిన మహ్మద్ పర్వేజ్ (19), ఉత్తరప్రదేశ్‌లో మోహన్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన మహ్మద్ గఫ్రాన్(28) సోమవారం రాత్రి పాడేరు నుంచి అనకాపల్లికి కారులో గంజాయి తీసుకెళ్తుండగా, అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. కారు (హెచ్‌పీ 37హెచ్ 1796) డిక్కీలో దాచిన 25 కేజీల గంజాయి, రూ.250, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ల ఆధారంగా మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వివాహిత మృతి

అనకాపల్లి: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందినట్లు పట్టణ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. సీఐ టి.వి.విజయకుమార్ వివరాల మేరకు... మునగపాక గ్రామానికి చెందిన పి.భవాని (30) భర్త మద్యానికి బానిస కావడంతో తీవ్ర మనస్తాపం చెందినామె గత నెల 16న పూడిమడక జాతీయ రహదారి సమీపంలో క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తండ్రి సూరిశెట్టి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మైనర్ శారదానదిలో పడి రైతు మృతి

రాంబిల్లి (యలమంచిలి): బహిర్భూమికి వెళ్లిన రైతు ప్రమాదవశాత్తు మైనర్ శారదా నదిలో పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. రాంబిల్లి సీఐ సిహెచ్ నర్సింగరావు వివరాల ప్రకారం... యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కట్టుపాలెం గ్రామానికి చెందిన రావాడ అప్పారావు (60) మూడు రోజుల క్రితం స్థానిక మైనర్ శారదా నది వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. అక్కడ కాలుజారిపడి నదిలో పడిపోయాడు. మంగళవారం రాంబిల్లి మండలం తెరువుపల్లి రాజుగారి తోట సమీప నదిలో మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు రాంబిల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం యలమంచిలి ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


తాండవకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం

నాతవరం: ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీరు ఇన్‌ఫ్లో తాండవ ప్రాజెక్టులోకి తగ్గడంతో మంగళవారం ఉదయం స్పిల్‌వే గేట్లు ద్వారా నదిలోకి నీటిని నిలుపుదల చేశామని ప్రాజెక్టు జేఈ రామకృష్ణ తెలిపారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు తాండవ రిజర్వాయరును ఆకస్మికంగా సందర్శించారు. ప్రాజెక్టు నీటిమట్టాన్ని, స్పిల్‌వే గేట్లు, సాగునీటి కాలువల్లో నీటిని ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి వివరాలను జేఈని అడిగి తెలుసుకున్నారు. ఉదయానికి 377.8 అడుగులు తగ్గిందన్నారు. ఇన్‌ఫ్లో నీరు తాండవ ప్రాజెక్టులోకి 400 క్యూసెక్కులు వస్తుందన్నారు. ఆయకట్టు భూములకు కుడి, ఎడమ కాలువలలోకి 400 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని వివరించారు. వీఆర్వో కాళ్ల అప్పారావు, ప్రాజెక్టు సిబ్బంది పాల్గొన్నారు.

బైకు బోల్తా పడి వీఆర్ఏకు గాయాలు

రోలుగుంట : రత్నంపేట వీఆర్ఏగా పని చేస్తున్న ఆర్లి మరిడియ్య బైకుపై రోలుగుంట తహసీల్దార్ కార్యాలయంలో నైట్ డ్యూటీకి మంగళవారం రాత్రి వస్తూ మార్గమధ్యంలో వడ్డిప–శరభవరం రూట్‌లో గోతిలో బోల్తాపడి గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో వీఆర్ఏకి రెండు కాళ్లకు స్వల్ప గాయాలు కాగా, ఒక పన్ను ఊడిపోయింది. ప్రమాద సమాచారం తెలియంతో శరభవరం వీఆర్ఏలు శేఖర్, అప్పారావు ప్రమాద స్థలానికి వచ్చి మరిడయ్యకు శరభవరంలో ఆర్ఎంపీ వైద్యుడు వద్ద తక్షణ వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం మరిడయ్యను నర్సీపట్నం తరలించారు.

గాయపడిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి



మృతి చెందిన దుర్గి నాయుడు (ఫైల్)

మాకవరపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. మండలంలోని శెట్టిపాలెం శివారు వెంకన్నపాలెం గ్రామానికి చెందిన చీపురుపల్లి దుర్గినాయుడు ఈ నెల 1న ఇదే గ్రామంలో కారు–ట్రాలీలారీ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. దుర్గినాయుడు హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తుండగా, స్వగ్రామంలో సోమవారం జరిగిన పండగ నిమిత్తం వారం రోజుల క్రితం భార్య, ఇద్దరు పిల్లలతో సెలవుపై వచ్చాడు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి మృతదేహానికి సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సైనిక లాంఛనాల నడుమ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

క్లుప్తంగా

శారదానది ఉరకలు



కాశీమదుం గ్రోయిన్‌పై నుంచి ప్రవహిస్తున్న శారదానది

కశింకోట: స్థానిక కాశీమదుం గ్రోయిన్‌పై నుంచి శారదానది ఉరకలు వేస్తూ ప్రవహిస్తోంది. తుపాను కారణంగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నదిలో వరద నీరు చేరి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రోయిన్ నుంచి ఉన్న రెండు ప్రధాన సాగు నీటి కాలువల ద్వారా కశింకోట, వెదురుపర్తి, అచ్యుతాపురం మండలం పెదపాడు గ్రామాల పంట భూములకు సాగు నీరు అందుతోంది. దీంతో కాలువలకు దగ్గరలో ఆయకట్టు రైతులు ఖరీఫ్ వరినాట్లు వేస్తున్నారు. నాట్లకు, చెరకు పంటకు నీటిని తడులు కడుతున్నారు. సాగునీటి ప్రవాహంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం: అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్ఠింపజేశారు. వేద మంత్రోశ్ఛరణలు, నాదస్వర వాయిద్యాల మధ్య తిరువీధిని వైభవంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 29 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,600	4,600
రెండో రకం	----	----
మూడోరకం	3,000	3,000

అనకాపల్లి సినిమాలు

గబ్బర్ సింగ్ : రాజా
తంగలాన్ : సత్యనారాయణ స్క్రీన్-1
కమిటీ కుర్రోళ్లు : సత్యనారాయణ స్క్రీన్-2
సింబా : పర్తిసాయి
శ్రీలక్ష్మీనరసింహ (జ్యోతి)జామి : షిర్డీసాయి
డబుల్ ఇస్మార్ట్ : వెంకటేశ్వర
మారుతీనగర్ సుబ్రమణ్యం : శ్రీసత్య
11 డిమోంటి కాలని : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 30 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-12 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 347 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 295 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

అన్నదాతకు ఎంత కష్టం..

- ఎడతెరిపిలేని వర్షాలకు తీవ్ర నష్టం
- నీట మునిగిన పంటలు
- అధ్వానంగా బండిబాటలు
- పొలాలకు వెళ్లాలంటే వాగులు దాటాల్సిందే
- మళ్లీ తుపాను హెచ్చరికలతో ఆందోళన

అన్నదాతకు ఎంత కష్టం.. మరెంత కష్టం వచ్చింది. ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి ఆరుగాలం కష్టించి పంట పండిస్తున్న రైతు గోడు పాలకులు పెడచెవిన పెడుతున్నారు. పర్యవసానంగా ప్రతిసారి తుపాను వర్షాలకు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. పొలాలకు, కళ్లాలకు వెళ్లాలంటే వాగులు, గెడ్డలపై కనీసం వంతెనలు నిర్మించడంగానీ, బండిబాటలు బాగుచేసిన పాపాన పోవడంలేదు. వీటికోసం దశాబ్దాలుగా మొరపెట్టుకుంటున్నా ఆలకించే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తుమ్మపాల: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో నీరు చేరి పంటలు నీట మునిగాయి. వాతావరణం అనుకూలించక అంతంత మాత్రంగా అనేక వ్యయప్రయాసలు పడి వేసిన వరి నాట్లతో పాటు మొక్కజొన్న, చెరకు, రాగులు, వేరుశనగ, కూరగాయల పంటల భూముల్లో నీరు చేరి మరింత నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఈ ఏడాది ఖరీఫ్ మొదటి నుంచి అడుగడుగునా రైతులకు అడ్డంకులే ఎదురవుతున్నాయి. పెట్టుబడులు పెట్టి కుదేలవుతున్న వారిని ఆదుకునే పాడిపరిశ్రమ కూడా ఇటీవల వర్షాలతో పూర్తిగా దెబ్బతింటోంది. పశువుల కళ్లాలు బురదమయంగా మారాయి. పశువుల చేల వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. గ్రామం నుంచి రైతుల కళ్లాలకు, పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలు, వాగులు దాటి మహిళా రైతులు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వాతవరణ శాఖ మళ్లీ తుపాన్ ప్రకటించడంతో రైతులతోపాటు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోకాల్లోతు నీటిలో రాకపోకలు..

అనకాపల్లి పట్టణానికి ఆనుకుని ఆవఖండం భూముల్లోకి వెళ్లాలంటే రైతులు మోకాల్లోతు నీటిలో రాకపోకలు చేయాల్సి వస్తోంది. వాగులు, గెడ్డలు ఆక్రమణతో నీరంతా పొలాల మీదకు చేరి నిలిచిపోయింది. మండలంలో శంకరం, తుమ్మపాల గ్రామాల్లో రైతుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ గ్రామాలతో పాటు మార్టూరు, మాకవరం, రేబాక, చింతనిప్పుల అగ్రహారం, బొజ్జన్నకొండ మధ్యలో 2 వేల ఎకరాల వరి పొలాలు ఉన్నాయి. సరైన రోడ్డు మార్గం లేక రైతులంతా అనేక గెడ్డలు, వాగులు దాటి పొలాలకు చేరుకుంటున్నారు. బండిబాటలు బురదమయంగా మారాయి. సీతానగరం, వెంకుపాలెం, తగరంపూడి, దిబ్బపాలెం, ఊడేరు గ్రామాల్లో బండిబాటలు మరీ దారుణంగా మారాయి. ఎక్కడ అడుగేస్తే కూరుకుపోతామో తెలియక రైతులు పొలం పనులు వదులుకుంటున్నారు. పశువులను కల్లాల్లోనే ఉంచేస్తున్నారు. సాగుకు రసాయనాలు వాడుక ఎక్కువవడంతో భూమిలో చేరిన వాటి మలినాల ద్వారా రైతులు అనేక రకాల జబ్బులు బారిన పడుతున్నారు.

అనారోగ్యం బారిన పశువులు

పొలాలతో పాటు మెట్ట భూముల్లోనూ నీరు చేరడంతో పశువులు కల్లాలకే పరిమితమయ్యాయి. వ్యవసాయంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు పశువులను పోషిస్తూ వచ్చిన పాల బిల్లుతో నెలవారీ ఖర్చులతో జీవనం సాగించే పరిస్థితులు కూడా పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఎడతెరిపి లేని వర్షాలతో వాగులు, కాలువల మీదుగా పశువుల కల్లాల మీదకు రావడంతో బురదమయంగా మారాయి. నీటితో కూడిన బురద మురుగులా తయారై పశువుల డెక్కల్లో చేరి అనారోగ్యానికి గురవుతున్నాయి. జ్వరాలతో పాటు పలు రకాల జబ్బుల బారినపడటంతో పాల ఉత్పత్తి పూర్తిగా పడిపోయింది. రైతులు ఆర్థికంగానే మానసికంగాను కుంగిపోతున్నారు. వ్యవసాయ, పశు సంవర్ధక అధికారులు గాని కనీసం స్పందించడం లేదు. క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపరిహారం చెల్లించాలని పాడి రైతులు కోరుతున్నారు.



పొలాలకు వెళ్లే దారి నీటిమయం



బురదమయంగా మారిన పొలాలకు వెళ్లే బండిబాట

అవగాహన చర్యలపై విఫలమవుతున్న అధికారులు

మండలంలో 6 వేల ఎకరాల మేర వరి విస్తీర్ణం, చెరకు, మొక్కజొన్న, తదితర పైర్లు మరో 3 వేల వరకు ఉంటోంది. వాటిలో దాదాపు పంటలు నీట మునిగి తేరుకుంటున్నాయి. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో కనీసం అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదు. అదేవిధంగా 25 వేల వరకు ఉన్న పశువుల ఆరోగ్యంపై ఎటువంటి జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల పాటు వర్షాలు పడినప్పుడు పశువులకు ఎలాంటి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందనే అంశాలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు.

బురదలోనే పశువులు



నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో పశువులు కల్లాల దిబ్బలకే పరిమితమయ్యాయి. పశువుల పాకలు, దిబ్బలు పూర్తిగా బురదగా తయారయ్యాయి. పొలాల్లో పూర్తిగా నీరే ఉంది. పశువులకు మేత సరిగ్గా లేదు. పాల దిగుబడి తగ్గిపోయింది. బురదలో ఉండటంతో డెక్కల వాపులు వచ్చే అవకాశం ఉంది. వర్షాలు ఎక్కువ రోజులు కురవడంతో పశువుల పెంపకం చాలా కష్టంగా ఉంది.

– మంత్రి నాని, పాడి రైతు, రేబాక గ్రామం

అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి



పొలాలు పూర్తిగా నీటి ముంపునకు గురయ్యాయి. మొన్నటి వరకు ఆకులు ఎండిపోయి బాధలు పడితే, ఇప్పుడు నీరు ఎక్కువై ఇబ్బందులు పడుతున్నాం. పైరు ఇంకా నీటిలోనే ఉంది. మళ్లీ వర్షం వస్తే పూర్తిగా నష్టపోతాం. ప్రభుత్వం స్పందించాలి. పంట నష్టంపై వివరాలు తీసుకుని న్యాయం చేయాలి. మరికొన్ని పంటల సాగుకు మందులు, తదితర జాగ్రత్త చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలి.

– సిహెచ్.నాగేష్, రైతు, చింతనిప్పుల అగ్రహారం

వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు

- ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు చిన్నియాదవ్ వినతి

అనకాపల్లి: ప్రస్తుతం కురిసిన వర్షాలకు ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏవో సత్యనారాయణకు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నీరు కలుషితమై ఎక్కడపడితే అక్కడ నిలువ ఉండిపోయిందన్నారు. దీనివల్ల దోమల వ్యాపించి, ఆయా ప్రాంతాల ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారినపడే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా డెంగ్యూ, మలేరియా, మెదడు వ్యాపు, చికెన్ గున్యా వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడకుండా అధికార యంత్రాంగం ముందస్తుగా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, నటభూషణ శోభనబాబు సేవా సమితి చైర్మన్ ముగడా అప్పారావు, యాదవ సంఘం నాయకులు భరణికాన సూరిబాబు, ఆర్య వైశ్యుల సంఘం నాయకులు ఉప్పల సాయి, బ్రాహ్మణ సంఘం నాయకుడు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న బొట్టా చిన్నియాదవ్

పౌష్టికాహారంతోనే పుట్టే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

సబ్బవరం: గర్భిణులు సరైన పౌష్టికాహారం తీసుకున్నప్పుడే పుట్టే బిడ్డలు బలంగా, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సబ్బవరం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పైడితల్లి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని గంగిరెడ్లకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తగిన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇళ్ల వద్దకే ఇచ్చే రేషన్ సరకులను వినియోగించుకోవడం ద్వారా గర్భిణీల్లో రక్తపుష్టి పెరిగి, బిడ్డలు ఆరోగ్యవంతంగా పుడతారని తెలిపారు. తీసుకునే ఆహారంలో ఆకుకూరలకు తగు ప్రాధాన్యతనివ్వాలన్నారు. మునగ, రాగి జావ తీసుకుంటే రక్తంలో ఐరెన్ శాతం వృద్ధి చెందుతుందన్నారు. వీటితోపాటు అంగన్‌వాడీల్లో ఇచ్చే మాత్రలు, టీకాలు తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలలో అందుబాటులో ఉండే మాత్రలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు కేవీ రత్నకుమారి, డి.పరదేశమ్మ, వై.రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



గర్భిణులు తీసుకోవాల్సిన మాత్రలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది

సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌కు గ్రేడ్-1 అధికారిగా పదోన్నతి

పెందుర్తి: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బీజీఎస్‌వీ ప్రసాద్‌కు గ్రేడ్-1 అధికారిగా పదోన్నతి కలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల సంఘం ప్రతినిధులు ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. దుశ్శాలువ వేసి, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర దస్తావేజు లేఖర్ల సంఘం ఉపాధ్యక్షుడు బలగా చిన్నారావు, కార్యదర్శి పెంటకోట శ్రీనివాసరావు, సీనియర్ లేఖర్లు పితాని నాగరాజు, పొన్నగంటి సురేష్‌కుమార్, గంటి శర్మ, గొర్లి శంకర్, బి.సోమేష్, అముజురి శ్రీను, డి.సుధీర్, ముక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌ను సత్కరిస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

అక్రమంగా చేపల చెరువుల నిర్వహణ

- నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న డిమాండ్

దేవరాపల్లి: మండలంలోని అనుమతులు లేకుండా అక్రమంగా చేపల చెరువుల నిర్వహిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న చేపల చెరువులను మంగళవారం ఆయన పరిశీలించారు. చేపలకు మేతకు పశు మాంస వ్యర్థాలు, చికెన్ వ్యర్థాలు, హోటళ్లలో వ్యర్థాలను వేస్తున్నారని, దీంతో ఈ చేపలు తినడం ద్వారా ప్రజలు క్యాన్సర్ వంటి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చేపల చెరువుల్లోని కలుషిత నీటిని పంట పొలాల్లోకి విడిచి పెట్టడంతో పొలాల్లో పనులు చేసే రైతులు చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని అన్నారు. మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే చేపల పెంపకందారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ స్వయంగా అక్రమ చేపల చెరువులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.



కొత్తపెంటలో చేపల చెరువును పరిశీలిస్తున్న సీపీఎం నేత వెంకన్న

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



మొగలిపురంలో వర్మీ కంపోస్ట్ ఫిట్‌లలో వానపాముల్ని వదులుతున్న ఈవోపీఆర్డీ మహేష్

సబ్బవరం: సేంద్రియ ఎరువులతో ఆరోగ్యవంతమైన వ్యవసాయ ఉత్పత్తులను సాధించవచ్చని ఈవోపీఆర్డీ మహేష్ తెలిపారు. మండలంలోని మొగలిపురం గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు ఫిట్‌లలో మంగళవారం ఆయన వానపాముల్ని విడిచిపెట్టారు. అనంతరం గ్రామంలో చేపలు, మాంసం, టిఫిన్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీలు చేసి, చెత్తబుట్టలను వినియోగించాలని, వ్యర్థాలను జనసంచారం లేనిచోట పారబోయాలని సూచించారు. షాపుల పరిసర ప్రాంతాల్లో శుభ్రత పాటించాలని, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను దుకాణాల యజమానులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గండి అరుణ, పంచాయతీ కార్యదర్శి సంతోషి, వార్డు సభ్యులు అంగటి నానాజీ, సచివాలయ సిబ్బంది సాయి, రేష్మ, శివ, రోహిణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం



పెద్దేరు జలాశయం గేట్లు వద్ద వున్న నీరు

మాడుగుల రూరల్ : మాడుగుల మండలంలో పెద్దేరు జలాశయంలో నీటి మట్టం క్రమేపి పెరుగుతోంది. వారం రోజులుగా కురుస్తున్న తుపాను వర్షాలకు జలాశయంలో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. మంగళవారం సాయంత్రానికి జలాశయంలో నీటి మట్టం 135.45 మీటర్లకు చేరింది. పూర్తి స్థాయి నీటి మట్టం 137 మీటర్లు ఉంది. కొండవాలు ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు 334 క్యూసెక్కులు నీరు జలాశయంలోకి వచ్చి చేరుతోందని జలాశయం జేఈ సుధాకరరెడ్డి తెలిపారు. జలాశయం నుంచి 50 క్యూసెక్కుల నీరు రాచకట్టు ద్వారా, మరో 50 క్యూసెక్కుల నీరు ఆర్ఎంసీ ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈ తెలిపారు.

వినాయక ఉత్సవాలకు ఘాట్ సిద్ధం

అనకాపల్లి: వినాయక ఉత్సవాల సందర్భంగా స్థానిక శారదానది ఒడ్డున వినాయక ఘాట్ మరమ్మతులు చేసి సిద్ధం చేసినట్టు వినాయక ఉత్సవ నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమార్‌స్వామి తెలిపారు. మంగళవారం స్థానిక శారదానది వినాయక ఘాట్‌ను జీవీఎంసీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న ప్రారంభమయ్యే వినాయక చవితి సందర్భంగా పట్టణ పరిధిలో వేలాది మంది భక్తులు విగ్రహాలను అదేరోజు సాయంత్రం నిమజ్జనం చేస్తారన్నారు. వారికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నిత్యం విద్యుత్ లైట్లు, తాగునీరు, పోలీస్ బందోబస్తు, జీవీఎంసీ కార్మికులతో పారిశుధ్య నిర్వహణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ నేతలు బొడ్డేడ నాగేశ్వరరావు, పి. సోమశేఖర్ పట్నాయక్, పి. పరదేశి, తిప్పన అప్పారావు, పెంటకోట వరప్రసాద్, జీవీఎంసీ ఉద్యోగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



వినాయక ఘాట్‌ను పరిశీలిస్తున్న ఆడారి కుమారస్వామి

శారదానది ఒడ్డున చెత్తాచెదారాలు

కశింకోట: శారదానది ఒడ్డున చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. స్థానిక పంచాయతీ పరిధిలోని చెత్తను తెచ్చి ఇక్కడ వేస్తున్నారు. దీంతో అది పెద్ద కుప్పగా మారింది. దీన్ని తొలగించాలని చాలా కాలంగా కోరుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. గతంలో ఇక్కడ కాశీమదుం గ్రోయిన్‌ను నీటి ప్రవాహం లేనప్పుడు, దిగువన వంతెన లేనప్పుడు పొలాలకు వెదురుపర్తి, పెదపాడు, అరబుపాలెం వంటి గ్రామాలకు దగ్గరి మార్గంగా రాకపోకలు సాగించడానికి వినియోగించేవారు. ఇప్పుడు చెత్త పేరుకుపోయి గ్రోయిన్‌కు వెళ్లే మార్గం మూసుకుపోయి అధ్వానంగా మారింది. దీంతో దుర్వాసన రావడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉందని స్థానికులు వాపోతున్నారు. సమీప నివాస ప్రాంతాలవారు చెడు వాసన వల్ల భరించలేక ఇబ్బంది చెందాల్సి వస్తోందని, వ్యాధులు వ్యాపిస్తున్నాయని వాపోతున్నారు. దీని దృష్ట్యా ఇక్కడి నుంచి చెత్తను దూరంగా తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై సోమవారం ఇక్కడకు వచ్చిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు విన్నవించారు.



కశింకోటలో శారదానది ఒడ్డున పేరుకుపోయిన చెత్త

బాలలపై లైంగిక దాడుల నిర్మూలనకు నడుం బిగించాలి

- క్షేత్రస్థాయిలో బాలల హక్కులపై అవగాహన కలిగించాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

పెందుర్తి: బాలలపై ఇటీవల కాలంలో లైంగిక దాడులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటి నిర్మూలనకు నడుం బిగించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం పిలుపునిచ్చారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పురుషోత్తపురంలోని బాలాజీ హైఫీల్డ్స్ పాఠశాలలో మంగళవారం బాలల హక్కుల పరిరక్షణ–ప్రవేటు పాఠశాలల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలల చట్టాలు, హక్కులపై క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగించాలన్నారు. పిల్లలు ఫిర్యాదులు చేసే విధంగా పాఠశాలల్లో ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేసి, తగిన పర్యవేక్షణ ఉంచాలన్నారు. తరగతి గదుల్లో దండనల కారణంగా విద్యార్థులు భయాందోళనకు గురై డ్రాపౌట్లు పెరుగుతున్నాయని, దీన్ని బాలల హక్కుల కమిషన్ సీరియస్‌గా తీసుకుంటోందన్నారు. ఇలాంటి దాడుల వలన విద్యార్థుల్లో మానసిక ఆందోళన పెరిగి, అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తోందన్నారు. ప్రవేటు పాఠశాలల్లో ఫీజుల అంశం కేవలం తల్లిదండ్రులతో మాత్రమే మాట్లాడాలని, పిల్లలపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. ఫీజుల ఒత్తిడిపై కమిషన్ సుమోటోగా స్వీకరించి, సంబంధిత పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. సదస్సులో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి డాక్టర్ ఖలీషా బేగం, పెందుర్తి ఎంఈవో-2 టి.మధుమూర్తి, ఎక్స్‌ప్రెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ ఆఫ్ హోల్డ్ జి.డేవిడ్‌రాజు, గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ చైర్మన్ ఉమారాజ్, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సీడీపీవో డి.నీలవేణి, పాఠశాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం

ప్రతి గ్రామానికి హిందూ సమితి



మాట్లాడుతున్న సత్యనారాయణ, రామకొండలరావు తదితరులు

మాడుగుల: ప్రతి గ్రామానికి హిందూ సమితిని ఏర్పాటు చేయడం జరిగిందని, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బంకుబల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలో జంపెన శివాలయం వద్ద హిందూ సమితి సభ్యులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విశ్వహిందూపరిషత్ 60 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ప్రతి గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి హిందూ పరిరక్షణకోసం జాగృతి తీసుకు వస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుద్దా సీతారామ్, మండల కార్యదర్శి రాపేట రామకొండలరావు, ప్రాంతాధికారి శోభారాణి, 29 పంచాయతీల నుంచి హిందూ సమితి సభ్యులు పాల్గొన్నారు.